డీడీయూఎస్ఎల్‌హెచ్‌లో సర్టిఫికెట్ కోర్సులకు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, మే 21: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ (ఆంధ్ర) మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హౌజ్‌లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్ కోర్సులైన ఎంఎస్ ఆఫీస్ – ఇంటర్నెట్, ట్యాలీ ప్రైమ్, బ్యూటీషియన్ కోర్సులతో పాటు హెర్బల్ ప్రొడక్ట్స్, పేపర్ బ్యాగ్ మేకింగ్‌లలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఈ కోర్సులలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులు విద్యార్థులు, నిరుద్యోగ యువత, గృహిణులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీట్లు పరిమితమని, ముందుగా వచ్చిన వారికి ప్రథమ ప్రాధాన్యతగా సీట్లు కేటాయిస్తామన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఎటువంటి వయోపరిమితి లేదని స్పష్టం చేశారు. కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్ నం: 9951 210441, 9701098541లలో సంప్రదించాలని సూచించారు.

ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఉస్మానియా లాంగ్వేజ్ సర్టిఫికెట్ కోర్స్, ప్రీ డిగ్రీ కోర్స్, బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

బీఎస్సీ (వొకేషనల్) వన్ టైం ఛాన్స్ పరీక్షా తేదీల మార్పు

బీఎస్సీ (వొకేషనల్) వన్ టైం ఛాన్స్ పరీక్షా తేదీలను మార్చినట్లు తెలిపారు. బీఎస్సీ వొకేషనల్ మొదటి, రెండు, మూడో సంవత్సరం పరీక్షలను వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నప్పటికీ, పరీక్షలను నిర్వహించే తేదీలలో మార్పులు చేసినట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

కాచిగూడ, మే 21: నిరుద్యోగ యువకులు టీ–సేవ ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు టీ – సేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీ–సేవ బ్యాంకు మిత్ర ద్వారా డెబిట్ కార్డ్సు, లైఫ్‌టర్మ్ ఇన్సూరెన్స్ చెల్లింపులు, బస్సు, రైలు, విమానాల టికెట్స్ బుకింగ్, కొత్త పాన్ కార్డులు, టెలికాం పోస్ట్‌పెయిడ్, ప్రీ పెయిడ్, ఆల్ బ్యాంక్స్ మనీ ట్రాన్స్ ఫర్లు, ఆధార్ పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం, బ్యాంక్ సేవలు అందించనున్నట్లు మంగళవారం పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఇంజనీరింగ్ యువకులు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొవచ్చని కోరారు. వివరాలకు ఫోన్ నం. 81799 557 44, www.tsevacentre.com లో సంప్రదించవచ్చని కోరారు.

నేడు స్మైలింగ్ బుద్ధ స్వర్ణోత్సవం

అడ్డగుట్ట, మే 21: భారతదేశం తొలిసారిగా నిర్వహించిన అణు పరీక్ష (స్మైలింగ్ బుద్ధ) జరిగి యాభై ఏళ్లు పూర్తైన సందర్భంగా తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్) ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీఏఎస్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ఐఐసీటీలోని వివేకానంద ఆడిటోరియంలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అణు పరీక్షల్లో కీలక పాత్ర పోషించిన పద్మ విభూషణ్ డాక్టర్ ఆర్.చిదంబరం పాల్గొంటారని చెప్పారు. 'మే 1974 టెస్ట్ అండ్ బియాండ్' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తారని వివరించారు. గౌరవ అతిథిగా న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాలల నిండా.. నిర్లక్ష్యమే.!

డీఈఓ, డిప్యూటీ డీఈఓలకు షోకాజ్ నోటీసులు

మరో 20 రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం

ఇప్పటికే పూర్తి కావాల్సిన పనుల్లో అధికారుల జాప్యం

కలెక్టర్ సీరియస్

జిల్లా వాసులకు మురుగు నీటితో కలెక్టరేట్ స్వాగతం

సిటీబ్యూరో, మే 21(నమస్తే తెలంగాణ): మరో 20 రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ కలెక్టర్ ఓసారి పాఠశాలలను పరిశీలిద్దామని బయల్దేరారు. కానీ, కలెక్టర్‌కు ఆ పాఠశాలలను చూసి మైండ్ బ్లాంక్ అయ్యింది. కొన్ని పాఠశాలలు భవన పెచ్చులూ, పెంకులూడి కలెక్టర్‌ను ఆహ్వానిస్తే.., మరొకొన్ని పాఠశాలలు నిండుకున్న చెత్తతో రా రమ్మన్నాయి. ఇంకొన్ని గదుల నిండా చీకటితో స్వాగతం పలికాయి.'' పాఠశాలల దుస్థితిని చూసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అవాక్కయ్యారు. ఇన్నాళ్లు ఏం చేస్తున్నారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు అన్ని వసతులతో సిద్ధంగా ఉండాలని బాధ్యతలు అప్పగించినప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం వహించారంటూ క్లాస్ పీకారు. అంతేకాదు పాఠశాలల్లో పనులు చేపట్టాలని ఆదేశాలిచ్చి నిర్లక్ష్యం వహించిన డీఈఓ రోహిణీ, ఇన్‌చార్జ్ డీఈఓ, అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్‌లకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

పాఠశాలలు సిద్ధం కావాలి

ఇప్పటికే జిల్లాలో పాఠశాలలు సకల వసతులతో రూపుదిద్దుకోవాలి. ఆ బాధ్యతలను సంబంధిత అధికారులకు గతంలోనే కలెక్టర్ అప్పగించారు. కానీ, కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నగరంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల వసతులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..' అన్న చందంగా దర్శనమిస్తున్నాయి. కాచిగూడలోని తులసీరామ్ నగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఇంగ్లిష్ మీడియం స్కూల్ పరిసరాలన్నీ చెత్తతో నిండిపోయాయి. కనీస చర్యలు కూడా తీసుకోలేదు. సైదాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలను సైతం కలెక్టర్ సందర్శించారు. అనంతరం, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను త్వరితగత గతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పేరెంట్ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేలా పాఠశాలు ఉండాలన్నారు. జిల్లాలో 440 పాఠశాలల్లో తాగునీరు. బెంచీలు, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, గ్రీన్ చాక్‌బోర్డు తదితర అన్ని వసతులు సమకూర్చాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, టీఎస్ఈడబ్ల్యూడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీ మియా హాజరయ్యారు.

మురికి నీటిని దాటితేనే.. కలెక్టరేట్‌లోకి..!

హైదరాబాద్ కలెక్టరేట్ ప్రధాన ముఖ ద్వారం మురుకినీటితో ఆహ్వానం పలకడం మరో విశేషం. సరిగ్గా గేటు మధ్యలో మొకాళ్ల లోతులో నీళ్లు నిలిచి ఉన్నాయి. ఎవ్వరొచ్చినా ఆ మురుకి నీళ్ల నుంచి నడవాల్సిందే. సాక్షాత్తు కలెక్టర్ వచ్చినా తన వాహనం ఆ మురుకి నీరును చిమ్మించాల్సిందే. కలెక్టర్ కార్యాలయమే ఇంత అపరిశుభ్రంగా ఆహ్వానం పలుకుతుంటే.. ఇక మిగిలిన ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి చెప్పక్కర్లేదంటూ.. అక్కడికి వచ్చిన ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు సైతం ఆ మురుకిలోంచి నడవాల్సిందే. దివ్యాంగులు ఆ మురుకి నీరును దాటలేక అందులో జారిపడుతున్నారని రమ్య అనే మహిళ తెలిపింది. మూడు రోజుల నుంచి ఆ మురికి అలానే ఉందని ఎవ్వరూ పట్టించుకోవడం లేదని చెప్పింది.

మర్యాద పూర్వకంగా..

కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లి కౌన్సిలర్ డప్పు కిరణ్ కుమార్ మంగళవారం తన జన్మదిన వేడుకల సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. - కుత్బుల్లాపూర్, మే 21:

14 ఏండ్లుగా పేదలకు అందని ఫలాలు

14 ఏండ్ల క్రితం నిర్మించి, నేటికీ అర్హులైన పేదలకు అలాట్‌మెంట్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని గన్‌ఫౌండ్రీ డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి, బీజేపీ సీనియర్ నాయకులు ఓంప్రకాష్ భీష్వ అన్నారు. ఈ మేరకు మంగళవారం పూల్‌బాగ్ బస్తీలో 2009లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద ఇండ్లను కట్టిన ఇండ్లను అర్హులైన వారికి కేటాయించాలని ఆయన నిరాహారదీక్ష చేపట్టారు. 2009లో ప్రారంభమైన ఈ పథకం ఒకటిన్నర సంవత్సరంలో పూర్తి చేసి ఇస్తామని నాటి ప్రభుత్వం ప్రజలకు హామీనిచ్చిందన్నారు. నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయకపోగా సుమారు ఐదారేండ్లు నిర్మాణానికి సమయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నేడు అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పేదలకు కేటాయించకపోవడం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. - అబిడ్స్, మే 21:

భవిష్యత్ విద్య రూపకల్పనలో ఎన్ఈపీదే కీలక పాత్ర

డాక్టర్ జోసెఫ్ ఇమాన్యూయేల్

అతిథులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఉప్పల్, మే 21: భవిష్యత్ విద్యను రూపొందించడంలో జాతీయ విద్యావిధానమే కీలక పాత్ర పోషిస్తుందని సీఐఎస్‌సీఈ చీఫ్ ఎగ్జిక్యూటీవ్, కార్యదర్శి డాక్టర్ జోసెఫ్ ఇమాన్యూయేల్ అన్నారు. హబ్సిగూడలోని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌లో సీఐఎస్‌సీఈ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ సమగ్ర అభివృద్ధి, నూతన బోధనా పద్ధతులను ప్రోత్సహించడానికి ఎన్ఈపీ–2020 మార్గదర్శకాలను అనుసంధానం చేయాల్సిన అవసరాలను వెల్లడించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి జరుగుతున్న సహకారంపై ఆసక్తిని వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలోని విద్యా సంస్థలు విద్యారంగంలో ముందు వరుసలో ఉండేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐఈఎస్ఈ పాఠశాలల ప్రాంతీయ కార్యదర్శి సుందరి, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఐసీఎస్ఈ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఆటో హిమోథెరపీ

కొవిడ్ వ్యాక్సిన్ బాధితులకు వరం

చికిత్స విధానానికి ఆయుష్ ఆమోదం

ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలర్జీ చైర్మన్ డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 21(నమస్తే తెలంగాణ): మేజర్ ఆటో హిమోథెరపీ (ఓజోన్ థెరపీ) ద్వారా పలు దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని పలు అధ్యయనాల ద్వారా రుజువైందని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలర్జి చైర్మన్, పల్మనాలజిస్ట్, ఎలర్జి సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ తెలిపారు. భారత ప్రభుత్వం ఆమోదించిన ఆయుష్ విభాగంలో ఇది కూడా ఒక చికిత్స విధానమని అన్నారు. ఈ చికిత్సా విధానంపై దేశంలో కొన్ని వందల మంది ఆయుష్ విభాగం వైద్యులు శిక్షణ పొందినప్పటికీ.. దీనిపై ప్రజల్లో సరైన అవగాహన లేక ఈ చికిత్సా విధానం పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదని చెప్పారు. ఓజోన్ థెరపీ చికిత్సా విధానంలో రెండు రకాల చికిత్సా పద్ధతులు ఉంటాయని, ఒకటి మైనర్ ఆటో హిమోథెరపీ చికిత్స విధానం 2. మేజర్ ఆటో హిమోథెరపీ విధానమని వివరించారు.

అల్లోపతిలో లేదు

ఈ చికిత్సా పద్ధతి క్లినికల్ ప్రాక్టీస్‌లో కూడా ఉన్నదని డాక్టర్ నాగేశ్వర్ తెలిపారు. అయితే దీనిపై అల్లోపతి వైద్యులకు శిక్షణ లేనందున ఇది అల్లోపతి విధానంలో అందుబాటులోకి రాలేదని అన్నారు. ఓజోన్ థెరపీ అనేది ప్రధానంగా 'న్యూరో డీజనరేటివ్ డిసీసెస్', వాస్కులార్ (రక్త నాలాలు, రక్తానికి సంబంధించిన) వ్యాధులకు వినియోగిస్తారని, దీని వల్ల ఉత్తమ ఫలితాలు ఉంటాయని తెలిపారు.

భయంకరమైన క్రిమి కీటకాలను ఎదుర్కొంటుంది



స్టఫలోకాకస్, ఏరియస్, ఇశ్చరిచియాకోలై, సూడోమోనాస్, ఎంటరోకాకస్ వంటి భయంకరమైన క్రిములు, కీటకాలను సమూలంగా నిర్మూలించే శక్తి ఈ ఓజోన్ థెరపీకి 99.6శాతం ఉన్నట్టు వైద్యపరిశోధనల్లో తేలిందని డాక్టర్ నాగేశ్వర్ తెలిపారు. కరోనా వ్యాధి విజృంభించిన సమయంలో ప్రపంచ నలుమూలల అతిపెద్ద వైద్య సంస్థల్లో కూడా ఎంఏహెచ్ (మేజర్ ఆటో హిమోథెరపీ) చికిత్సా విధానాన్ని వైరస్ క్రిములపై ప్రయోగించారని వివరించారు. సాధారణ రోగులే కాకుండా ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులపై కూడా ఈ చికిత్సా విధానాన్ని అమలుచేయగా, ఆసక్తికరమైన ఫలితాలు వెలువడ్డాయని చెప్పారు. ఈ ఓజోన్ థెరపీతో కొవిడ్ మహమ్మారికి చెక్ పెట్టవచ్చని వైద్యనిపుణులు నిర్ధారణకు వచ్చినట్టు చెప్పారు.

ఓజోన్ చికిత్సా పద్ధతి: రోగి నుంచి ఐవీ ట్యూబ్ ద్వారా 50–100ఎంఎల్ రక్తాన్ని తీస్తారని, తరువాత ఆ రక్తాన్ని ఓజోన్‌తో కలిపి తిరిగి మళ్లీ అదే రోగికి ఎక్కిస్తారని డాక్టర్ నాగేశ్వర్ చెప్పారు. ఈ విధంగా 5 నుంచి 6 సైకిల్స్ చేసిన అనంతరం రోగి వ్యాధి నిరోధక శక్తి అద్భుతంగా పెరగడం, కొవిడ్ వల్ల రోగి రక్తం గడ్డ కట్టకుండా ఉండటం, రక్తంలో ఉన్న సైటోకైన్స్ విజృంభించకుండా కాపాడడం వంటి ఫలితాలు ఉంటాయని వివరించారు. ఈ చికిత్సా విధానంలో ఒక సైక్లింగ్‌కు 20–30 నిమిషాల సమయం పడుతుందని అన్నారు.

కొవిడ్ వ్యాక్సిన్ బాధితులకు వరం: డాక్టర్ నిర్లేప ప్రసాద్

కొవిడ్ ఇన్‌ఫెక్షన్ ప్రారంభంలోనే ఓజోన్ థెరపీ తీసుకుంటే ఉత్తమ ఫలితాలు కనిపిస్తున్నాయి. అంతే కాకుండా కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న తరువాత ఏర్పడే ఆటో ఇమ్యూన్ డిజార్డర్స్, రక్తం గడ్డకట్టే దుష్పరిణామాలు ఎదుర్కొనే రోగులకు ఈ చికిత్సా విధానం ఒక వరంగా చెప్పవచ్చు.

ఓజోన్ థెరపీ వల్ల కలిగే లాభాలు:

- కొవిడ్ రోగుల్లో ఆక్సిజన్ శాతం పడిపోకుండా రోగి ప్రాణాలను కాపాడుతుంది.
- ఖర్చులేని సులువైన చికిత్సా విధానం
- ఎలాంటి దుష్ప్రభావాలు లేని సురక్షితమైన చికిత్సా విధానం

తెలుగు వర్సిటీ వీసీకి ఘనంగా అభినందన

తెలుగు యూనివర్సిటీ, మే 21: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి 11వ ఉపాధ్యక్షులుగా పనిచేసిన ఆచార్య తంగెడ కిషన్ రావు మూడేళ్ళ పదవీ కాలం ముగిసినందున మంగళవారం వర్సిటీ ప్రాంగణంలో గల ఆడిటోరియంలో ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సత్కరించారు. నాంపల్లి ప్రాంగణంలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న తెలుగు వర్సిటీని వంద ఎకరాల విస్తీర్ణంలో బాచుపల్లిలో నూతనంగా నిర్మించిన భవన సముదాయాల ప్రాంగణానికి తరలించేందుకు కిషన్ రావు చేసిన కృషిని ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ కొనియాడారు. విశ్వవిద్యాలయం పీఠాధిపతులు, శాఖాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కిషన్‌రావుతో గల అనుబంధాన్ని నెమరువేసుకుని ఘనంగా సత్కరించారు. తన శక్తివంచన లేకుండా చేసిన కృషికి సహకరించిన వర్సిటీ పరిపాలనా, బోధన సిబ్బందికి, విద్యార్థులకు కిషన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు వర్సిటీ వీసీగా పనిచేసిన కిషన్‌రావుకు ఘనంగా వీడ్కోలు పలికిన ఉద్యోగులు

నూతన వీసీగా శైలజ రామయ్యార్

పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి శైలజ రామయ్యార్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. కాగా, బుధవారం శైలజ రామయ్యార్ బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రతి మూడేండ్లకు విశ్వవిద్యాలయానికి నూతన వీసీని నియమించే ఆనవాయితీ ఉండగా, పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇన్‌చార్జి వీసీ నియామకంతోనే ప్రభుత్వ సరిపెట్టింది. కాగా, జూన్ 16వ తేదీలోపు పూర్తి స్థాయి వీసీని నియమించేలా ఉన్నత విద్యా శాఖ మంగళవారం జీవో జారీ చేసింది. తెలుగు వర్సిటీ వీసీ కోసం ప్రభుత్వానికి 66 మంది దరఖాస్తు చేసుకోగా, కమిటీ అందులో నుంచి ఒకరిని ఎంపిక చేసి జూన్ 16 వరకు పూర్తి స్థాయి వీసీని నియమించే అవకాశం ఉంది. ఇన్‌చార్జి వీసీగా శైలజ రామయ్యార్ నెల రోజుల పాటు కొనసాగనున్నారు. తదుపరి పూర్తి స్థాయి నియామకాలు త్వరలో అందనున్నాయి.

జేఎన్ఏఎఫ్ఏయూ వీసీకి ఘనంగా వీడ్కోలు

సుల్తాన్‌బజార్, మే 21: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవీ కాలం పూర్తవడంతో మంగళవారం వీసీ ప్రొఫెసర్ కవితా దర్యానీ రావుకు వర్సిటీ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ జి.మధుకర్, సీఎఫ్ఏ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్, ఎస్‌పీఏ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్.కుమార్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు విష్ణువర్ధన్, ఆలంగిరి రేణుక, మాసూం అలీ, మహిపాల్‌రెడ్డి, హెచ్ వోడీలు ఎంఎల్ ఆనంద్, జె.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సైదులు, రామక్రిష్ణతో పాటు బోధనేతర సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా వీడ్కోలు పలికారు. వైస్ ఛాన్సలర్‌గా పదవీ కాలం పూర్తి చేసిన ప్రొఫెసర్ కవితా దర్యానీ రావు వర్సిటీ పాలక వర్గంలో కీలక పదవులలో విధులను నిర్వర్తించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, రిజిస్ట్రార్‌గా మూడేళ్ళ కాలం, వైస్ చాన్సలర్‌గా ఆరేళ్ళ పాటు కొనసాగారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేశారని వర్సిటీ అధికారులు, సిబ్బంది కొనియాడారు.

ప్రొఫెసర్ కవితా దర్యానీ రావుకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న రిజిస్ట్రార్ జి మధుకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు విష్ణువర్ధన్, ఆలంగిరి రేణుక, మాసూం అలీలు

వీసీగా ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్

జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవీకాలం పూర్తవడంతో ఆ స్థానం దక్కించుకునేందుకు ఆశావహులు 51 మంది విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ తాత్కాలిక ఉప కులపతిగా ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లలిత కళల విశ్వ విద్యాలయంగా పేర్గాంచిన జేఎన్ఏఎఫ్ఏయూ వర్సిటీ వీసీగా కొనసాగిన ప్రొఫెసర్ కవితా దర్యానీ రావు పదవీ కాలం పూర్తవడంతో వర్సిటీల వీసీల నియామకంలో భాగంగా ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌ను నియమించారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ళ మహేందర్

గన్‌పార్కులో నిరసన తెలుపుతున్న బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

తెలుగు యూనివర్సిటీ, మే 21: నిరుద్యోగ యువత పట్ల చిత్తశుద్ధి లేకుండా ఉద్యోగాలు కలిపించలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి సరైన సమయంలో బుద్ధి చెబుతామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ళ మహేందర్ హెచ్చరించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన తదితర సమస్యలపై గన్‌పార్కులో గల అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం బీజేవైఎం నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ, యూత్ డిక్లరేషన్ ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి నేటి వరకు హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ఎన్నికల హామీని అమలు చేయాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 50 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల, యూనివర్సిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను త్వరితగతిన నిమమించాలని అన్నారు. రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల వడ్లకు బోనస్ విడుదల చేయాలన్నారు. నిరసన కారులను పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శులు సామల పవన్‌రెడ్డి, కుండే గణేష్, సురేష్ గౌడ్, నామని మహేష్, కుమార్ యాదవ్, చిత్తరంజన్ రెడ్డి, తరుణ్ రెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

హియాయత్‌సాగర్

పరిశీలనలో జేఎం నేతలు

సిటీబ్యూరో, మే 21(నమస్తే తెలంగాణ): హిమాయత్‌సాగర్ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం జలమండలి గుర్తింపు కార్మిక సంఘం చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీ నారాయణలు సందర్శించారు. శిథిలావస్థతో ఉన్న ఈ డివిజన్ కార్యాలయం పై కప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయని, ఉద్యోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనిచేస్తున్నారంటూ జీఎంతో చర్చించారు. ఈ మేరకు నూతన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపాలని జీఎంను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహ, మల్లేష్, దర్శన్, భీంరావు, రాజేషవ, షబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఆర్ఐలో ఆర్ఎఫ్ఐడీ ఆధారిత లైబ్రరీ

సిటీబ్యూరో, మే 21(నమస్తే తెలంగాణ): రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ లైబ్రరీని ఎన్జీఆర్ఐలో ప్రారంభించారు. అధునాతన సౌకర్యాలతో లైబ్రరీ సేవలను విస్తరించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లుగా ఎన్జీఆర్ఐ వర్గాలు పేర్కొన్నాయి. ఎన్జీఆర్ఐ సెంటర్‌లోని లైబ్రరీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆర్ఎఫ్ఐడీ లైబ్రరి మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను డైరెక్టర్ డా.ప్రకాష్ కుమార్ ప్రారంభించారు.